


# ఆమె లేదు

ద్వివేదుల విశాలాక్షి

రైలు, స్టేషనులో ఆగగానే సూటుకేసు, చేతిసంచి తీసుకొని దిగేడు రాజశేఖరం. ప్లాటుఫారం అంతా ఎక్కేవాళ్ళతో, దిగేవాళ్ళతో, సామాన్లు మోస్తున్న కూలీలతో చాలా రద్దీగా ఉంది. ఆ రద్దీలోంచి తప్పించుకొని మెల్లిగా గేటుబయటికి చేరుకొన్నాడు.

"రిక్షా బాబూ రిక్షా"

"జట్కా తెమ్మంటారాబాబూ"

"అయ్యగారు నంబర్‌వన్ పెట్టి ఉంది. తీసుకురానాబాబూ" అంటూ రకరకాల మనుష్యులు రాజశేఖరంగారిని చుట్టుముట్టేరు.

"వెళ్ళండి ... వెళ్ళండి ... ఏమక్కర్లేదు" అంటూ వాళ్ళని విడిపించుకొని మరినాలుగు అడుగులు ముందుకి వేసేడు.

"బాబూ రిక్షా కావాలా" అన్నాడు అక్కడ మర్రి చెట్టు కింద అలసట తీర్చుకొంటున్న ఒక ముసలివాడు.

వాడిని చూడగానే ఎందువల్లో వచ్చినవాడని, నెమ్మదైనవాడు అనిపించింది రాజశేఖరానికి.

"బాబా కాలనీ తెలుసా?" అంటూ ప్రశ్నించేడు.

"తెలీక పోవడమేంటి బాబూ! ఈ ఊళ్ళో పుట్టి పెరిగినోణ్ణి. రండి బాబూ" అంటూ రిక్షా ముందుకి లాగి పెట్టుకొన్నాడు.

"ఏం తీసుకొంటావు?" సూటుకేసుని చేయి మార్చుకొంటూ అడిగేడు రాజశేఖరం.

"రూపాయిప్పించండి బాబూ". తలగుడ్డ దులిపి చుట్టుకొంటూ అన్నాడు రిక్షావాడు.

"రూపాయే!"

"సాలా దూరం బాబూ"

"ఎంతుంటుంది?"

"రెండు మైళ్ళ పైమాట"

"రెండు మైళ్ళు చాలా దూరమా!"

"అంతా అప్పు బాబూ! రిక్షా తొక్కేవరికి ఎంత పడుచోడికైనా ప్రాణాలు పోతాయి. మా రిక్షావాళ్ళ ప్రాణానికి వేసే యముడులో ఖర్చు కొనక్కరలేదు బాబూ! ఈ ఊళ్లో ఈ అప్పు, దెబ్బ సాలు" అన్నాడు రిక్షావాడు తను అధికంగా ఏమీ అడగలేదన్న ధోరణిలో.

"ముప్పావలా ఇస్తాను. ఇష్టమైతే రా" అన్నాడు రాజశేఖరం.

"ఎక్కండి బాబూ! కష్టం సూసి, "ఎదవా పట్టుకుపోరా" అని ఆ పావలా డబ్బులు మీరే పడేత్తారు" అన్నాడు రిక్షావాడు.

రిక్షా బజారులోంచి పోతున్నాది. ఇటు, అటు వెండి, బంగారుకొట్లు, బట్టలషాపులు. వాటిముందు వరుసలు తెలి నిల్చిఉన్న రంగురంగుల కార్లు, రోడ్డు మీద కార్లని, బస్సుల్ని తప్పించుకొంటూ సాగిపోతున్న జనప్రవాహం – చాలా సందడిగా ఉంది ఆ ప్రదేశం.

రిక్షావాడు "తప్పుకోండమ్మా ... తప్పుకోండి బాబూ" అంటూ గొంతుక చిల్లు పడేలా అరుస్తూ ముందుకుపోతున్నాడు.

"బాబా కాల నీపోడానికిమరో దారిలేదా? ఈ వీధి మరీ రద్దీగా ఉంది. ఇలా తీసుకొచ్చేవేం?" అన్నాడు రాజశేఖరం.

"బజారు ఈదికదబాబూ! అందునా సందెతేల ఇట్టగేఉంటుంది. కోలనీకి పోడానికి ఇంకోదారుందికాని అది సుట్టుదారి. కట్టపడి ఈ బజార్లో నాలుగు ఫర్లాంగులు లాగేసేమంటే మైలుకిపైగా కలిసొస్తది" అన్నాడు రిక్షావాడు.

బజారు దొమ్మిలోంచి బయటపడ్డాక రిక్షా జోరుగా సాగిపోయింది. చిన్న, పెద్ద వీధుల్ని దాటుకొంటూ బాబా కాలనీ వైపుగా పరుగు తీసింది. అంతవరకు పోతున్న మెయిన్‌రోడ్డు వదలి రిక్షాను ఎడంపక్కగా తిప్పేడు. "ఇదంతా బాబా కాలనీయే బాబూ! ఎటుపోవాల" అన్నాడు రిక్షావాడు వెనుతిరిగి చూస్తూ.

రాజశేఖరం అంతకుపూర్వం ఎప్పుడూ ఆ ఊరు వచ్చింది లేదు. అక్కడ రామచంద్రంగారిల్లు ఏ వీధిలో ఉందో అతడికి తెలియదు. నిజానికి ఆ రామచంద్రాన్ని అతను ఎరగడు. అతని భార్యతో కూడా ఏమంత పెద్ద పరిచయం లేదు. రామచంద్రంభార్య రాజ్యలక్ష్మికి, రాజశేఖరం మామగారికి ఏదో చుట్టరికం లాంటిది ఉంది. ఆ చుట్టరికం మాట అలా ఉంచినా, రాజ్యలక్ష్మికి, రాజశేఖరం భార్య బాలామణికి చిన్ననాటి నుండి బాగా స్నేహం. ఇరుగు, పొరుగు ఇళ్ళలో ఉంటూ, ఒకే స్కూల్లో చదువుకొంటూ కలసి, మెలసి పెరిగేరు. ఇద్దరికీ పెళ్ళిళ్ళయి అత్తవారిళ్ళకి వెళ్లిపోయినా ఏదో విధంగా అవకాశం కల్పించుకొని ఏడాదికి ఒకటి, రెండు సార్లు ఎక్కడో అక్కడ కలుసుకోకుండా వాళ్ళు ఉండలేదు.

అంతకు ముందునెల ఏదో పెళ్లి సందర్భంలో బాలామణి రాజ్యలక్ష్మిని కలుసుకొన్నప్పుడు రాజశేఖరం పనిమీద వాళ్ళ ఊరు రావలసి ఉందని చెప్పడం జరిగింది. దానిపై రామచంద్రం రాజశేఖరానికో ఉత్తరం రాస్తూ "మీరు ఎప్పుడు వచ్చినా మా ఇంట వచ్చి ఉండాలి. ఆడవాళ్ల మధ్య ఉన్న మైత్రి మన కలయిక వల్ల మరికాస్త బలపడుతుంది" అంటూ స్నేహ పూర్వకంగా రాసేడు. ఈ కారణాలన్నిటివల్ల ఆనాడు బాబా కాలనీలో రామచంద్రం ఇల్లు వెతుక్కుంటూ రావలసిన అవసరం ఏర్పడింది రాజశేఖరానికి.

"రామచంద్రం గారింటికి పోవాలోయ్. బి. రామచంద్రం" అన్నాడు రాజశేఖరం ఇటు అటు చూస్తూ, ఎటు పోవాలో తెలియక.

"అట్టా రావచంద్రంగోరి ఇల్లంటే తెలుసుకోడం కట్టంబాబూ! ఇంటి నంబరుంటే తెలుత్తాది కాని" అన్నాడు రిక్షావాడు ఒక వీధిలోంచి రిక్షా పోనిస్తూ.

రాజశేఖరం ప్రయాణం అనుకోగానే బాలామణి భర్తకి వారింటి గుర్తులు ఏవేవో చాలానే చెప్పింది. ఇంటి ముందు పోకచెట్లు, ఎదురుగా చిన్న పార్కులాంటిది, వీధి చివర కిళ్లీ బడ్డీ –" అంటూ. వచ్చిన చిక్కేమిటంటే అక్కడ రమారమి అన్నిళ్ళముందర పోకచెట్లు ఉన్నాయి. ఇంక పార్కులాంటి ప్రదేశం, కిల్లీ బడ్డీ అనవాళ్ళుకల నాలుగైదు ఇళ్ళు

తారసపడ్డాయి. అవేవీ రామచంద్రం గారివి కావు.

పోను, పోను దారి కొంచెం ఎక్కుతున్నట్లు అలా పైకిపోతున్నాది. రిక్షావాడు కాస్తసేపు సైకిలు తొక్కుతూ, మరికాస్తసేపు చేత్తో లాగుతూ ప్రయాస పడుతున్నాడు. అంతలో రాజశేఖరానికి గుర్తువచ్చింది. ఏదో కాగితంమీద ఆ ఇంటినెంబరు ఉండాలి అని. సూటుకేసులోని బట్టల్ని పక్కకితప్పించి అడుగున ఉన్న కాగితాల ఫైలు అందుకొన్నాడు. అయిదునిముషాలపాటు అన్నికాగితాల్ని తిప్పిచూడగా చివరకి ఒక చిన్న కాగితం ముక్కమీద కన్పించింది ఆ నెంబరు. అది వాళ్ళ ఇంటినెంబరే. సందేహం లేదు. ఆ విషయం రాజశేఖరానికి బాగాగుర్తుంది. రామచంద్రం ఉత్తరానికి జవాబు వ్రాయబోతూ బాలామణిని అడిగి తెలుసుకొన్నాడు. అప్పటికి జేబులో ఉన్న ఏదో బిల్లుమీద ఎదురుగాఉన్న కిష్టిగాడి రంగుపెన్సిలితో ఆ నెంబరునోటు చేసుకొన్నాడు. ఎనిమిది, ఒకటి. "రామచంద్రం ఇంటినెంబరు ఎనభైఒకటి. అందులో మరేం సందేహం లేదు" అనుకొన్నాడు.

"ఇదిగోనోయి ఇంటి నెంబరు దొరికింది. ఎనభైఒకటి" అన్నాడు రాజశేఖరం రిక్షావాడితో.

"సంపేసేరు బాబూ" అన్నాడు రిక్షావాడు నుదుట పట్టిన చెమటను చేత్తో ఊడ్చిపోస్తూ.

"ఏం?" అన్నాడు రాజశేఖరం అర్థంకాక.

"ఈ డౌనంతా దిగి ఆ అప్పు ఎక్కాలి బాబూ" అన్నాడు రిక్షావాడు దూరంగా ఉన్న ఇళ్ళని చూపిస్తూ.

ఆ సాయంకాలపు చిరు ఎండలో తెల్లని ఆ బంగళాలు పాలరాతి సౌధాల్లా మెరసిపోతూ దూరానికి ఎంతోఅందంగా కన్పిస్తున్నాయి.

"ఏం చేస్తాం మరి. నాకీ ఊరు కొత్త. ఈ నెంబరు ముందుగా కన్పిస్తే ఏ బాధా లేకపోయేది. పద. నే నడుస్తాలే" అన్నాడు రాజశేఖరం.

"డౌన్ ఫరవాలేదు బాబూ! అప్పు వచ్చేక కావాలంటే నడుద్దురుగాని" అంటూ అటు నుండి ఇటు బండిని తిప్పేడు రిక్షావాడు.

ఆపసోపాలు పడ్తూ అంత ఎత్తూ ఎక్కి ఎనభై ఒకటి నెంబరు ఇంటి ముందు నిల్చింది రిక్షా. 'దిగండి బాబూ! వచ్చేసినాం. అదో ఎనభై వోటి' అన్నాడు రిక్షావాడు.

గేటుకి అమర్చి ఉన్న ప్లాష్టిక్ పత్రంమీద ఎనభై ఒకటి నెంబరు స్పష్టంగా ఉంది. రిక్షావాడికి మొదట వాడు అడిగిన దానికన్న మరి నాలుగు డబ్బులు ఎక్కువగానే చేతిలో పెట్టేడు రాజశేఖరం. వాడు సంతోషంగా రాజశేఖరానికో 'దండం' పారేసి ఉత్సాహంగా బెల్లు వాయించుకొంటూ కిందికి దిగిపోయేడు.

ఆ వీధి అంతా నిర్మానుష్యంగా ఉంది. ఆ సమయంలో ఆ ప్రైవేట్ ఇళ్లల్లో మనుష్యులు ఉన్న జాడకూడా లేదు. ఏవో కొన్ని ఇళ్ళలోంచి లైట్లు కన్పిస్తున్నా చాల వరకు చీకటిగానేఉన్నాయి. అక్కడినుంచి వెనుతిరిగిచూస్తే కొంచెం దిగువగా కాలనీ రోడ్డు, కుడి పక్క దూరంగా మైనురోడ్డు, దానిపై జోరు, జోరుగా సాగిపోతున్న కార్లు, బస్సులు అన్నీ లీలగా కన్పిస్తున్నాయి.

ఎనభై ఒకటి నెంబరు ఇంటి పోర్టికోలో లైటు వెలుగుతున్నాది. దాని వెలుగు రమారమి గేటువరకు కొద్దో, గొప్పో పడుతున్నాది. గేటుకి "కుక్కలున్నాయి జాగ్రత్త" వంటి బోర్డులేమైనా ఉన్నాయేమోని పరీక్షగాచూసేడు రాజశేఖరం. అతడి చిన్న తనంలో ఒకసారి ఏదో పిచ్చికుక్క వెంటతరిమి అతన్ని కరవబోయింది. అప్పటినుంచి అతడికి కుక్కలంటే చెప్పలేనంత భయం.

కుక్కల బోర్డు కోసం అలా పరీక్షగా చూస్తుంటే గేటుకి పక్కగా సిమ్మెంటు పలకమీద ఇంటి యజమానిపేరు కన్పించింది. పెయింట్ పాతబడి పెచ్చు ఊడిపోవడంవల్ల ఆ కనుచీకట్లో అక్షరాలు అంత స్పష్టంగా కన్పించలేదు. మరికాస్త దగ్గరికి వెళ్లి పరీక్షగా చూసేడు. అది రామచంద్రంగారిఇల్లే, అందులో సందేహం లేదు. 'రాజలక్ష్మిగారి ఇల్లు విశాలంగా ఉంటుంది. చల్లటిగాలి, ప్రశాంతమైన వాతావరణం. మీకేదానికీ ఇబ్బంది ఉండదు' అంటూ భార్య చెప్పినా వారిది ఇంత పెద్ద బంగళా అనుకోలేదు రాజశేఖరం.

గేటు తీసుకుని మెల్లగా లోపలికి వెళ్ళేడు. ఎక్కడా మనుషులున్నజాడకన్పించలేదు. ఒక్క క్షణం ఇటూ అటూచూసి తలుపుపై చేతితో టక టక మని కొట్టేడు. ఆ చప్పుడువిని పక్కనున్న కారు షెడ్డులోంచి కళ్లు నులుపుకొంటూ ఒక కుర్రాడు లేచి వచ్చేడు.

"ఎవరు కావాలి మీకు" అన్నాడు రాజశేఖరాన్ని పరిశీలనగాచూస్తూ,

"అయ్యగారు ఇంట్లో ఉన్నారా?"

"ఇంకా ఆఫీసునుంచి రాలేదు"

"అమ్మగారో?"

"అమ్మగారు ఊరికివెళ్ళేరు. ఈరోజో, రేపో వస్తారనుకొంటున్నారు"

"వీళ్ళమాటలువిని లోపలినుంచి వచ్చేడు గోపన్న. వాడి వేషభాషలు చూసి ఆ ఇంట్లో వంటవాడై ఉంటాడనుకొన్నాడు రాజశేఖరం. అంతదురుసుగా సమాధానాలు చెప్తున్న ఆ పిల్లడిని మందలించిన తీరుచూసి అంతకుమించి ఇంకేదో స్థానం అతడికి ఆ ఇంట్లో ఉన్నట్లనిపించింది.

రాజశేఖరం చేతిలోని పెట్టె, సంచీ చూడగానే అతడు అమ్మగారితాలూకో, అయ్యగారితాలూకో బంధువైఉంటాడని గోపన్న గ్రహించేడు. అలా తరుచు వచ్చిపోయే చుట్టపక్కాల్ని ఆదరించి, గౌరవించి పంపవలసిన బాధ్యత అతని నిత్య కృత్యాల్లో ఒకటి.

"రండి బాబూ... రండి ... అలా నిలబడి పోయేరేం" అంటూ అతని చేతిలోని పెట్టె అందుకొని అతిథులకోసం ఏర్పాటైన గదిలోకి దారి తీసేడు.

"ఇదిగో బాబూ, ఇది స్నానాల గది. వేడినీళ్ళు కావాలంటే ఈ పంపులోంచి వస్తాయి. సబ్బు, తువ్వాలు అక్కడ ఉన్నాయి. మీరు స్నానంచేసి వచ్చే

సరికి కాఫీ కాచి తెస్తాను' అని అన్నీ వివరంగా రాజశేఖరానికి చూపించి వెళ్లిపోయేడు గోపన్న.

రాజశేఖరం ఆ గదీ, దానిలోని అలంకరణ, ఆ స్నానాల గది, అందులోని వస్తువుల్ని వింతగా చూస్తూ చాలాసేపు అలా బొమ్మలా నిల్చి ఉండిపోయేడు. బాల మా రాజ్యలక్ష్మి ... మా రాజ్యలక్ష్మి అంటూ వీరింటికి వచ్చి వారం, పదిరోజుల వరకూ ఒక్కొక్కసారి తిరిగి రాకుండా ఉంటే ఇంకా అదంతా వారి స్నేహ మహిమే అనుకొనే వాడిని, సంగతి ఇదన్నమాట. స్వర్గధామం వంటి ఈ ఇల్లు విడిచి బెజవాడ ఇరుకు సందుల్లోకి రావాలని ఎవరికి మాత్రం వుంటుంది" అనుకొన్నాడు రాజశేఖరం షవర్ క్రింద తృప్తిగా స్నానం చేస్తూ.

రాజశేఖరం డ్రాయింగ్ రూమ్‌లో కూర్చుని కాఫీ తాగుతుంటే,

"బాబూ మీరు అమ్మగారివంక చుట్టాలా లేకఅయ్యగారివంకా" ?అంటూ కుశలప్రశ్న వేసేడు గోపన్న.

'అవడానికి అమ్మగారివంక చుట్టాన్నే కాని ఈ రావడం మాత్రం అయ్యగారి ఆహ్వానం మీదే వచ్చేను' అన్నాడు రాజశేఖరం.

'అలాగాండి' అన్నాడుగోపన్న. అమ్మగారికి, అయ్యగారికి కూడా కావలసిన ఈ చుట్టపాయనకి ఎటువంటి మర్యాదలు చెయ్యాలా అని ఆలోచిస్తూ.

"మీ అయ్యగారు ఏవేళకి ఇంటికొస్తారు" అన్నాడు రాజశేఖరం.

"వస్తారండి... వస్తారు. వేళకేముంది? అమ్మగారు ఇంట్లోఉంటే ఈ పాటికి వచ్చేసేవారండి. మరి ఇప్పుడు ఒక్కరూ ఇంట్లోఉంటే తోచదు చూడండి అదుకని..."

హాయిగా వేడినీళ్ల స్నానంచేసి వేడివేడి కాఫీ తాగేసరికి రాజశేఖరానికి ప్రయాణపుబడలిక సగం తీరిపోయినట్లు అన్పించింది. ఇంటి యజమాని వచ్చేలోపు అలా తోట ఒకసారి చుట్టిరావాలనిపించింది. పౌర్ణమివెళ్లిన విదియ. వెన్నెల పిండారపోసినట్టుంది. తెల్లని ఆ పాలవెన్నెల్లో అందమైన గులాబీలు, రకరకాల మల్లెలు, రంగురంగుల క్రోటన్సులు, ఇంకా నైట్ క్వీన్, దిల్ బహార్, చమేలీ పొదలతో అందంగా, కళాత్మకంగా తీర్చి దిద్దినట్లుంది ఆ తోట. గుబురుగా పెరిగిన తుప్పలో అరవిచ్చిన ఎర్ర గులాబి అతని మనసుని వశపర్చుకొంది. కవ్వించిన ఆ గులాబిని కోసి వాసన చూస్తూ ఇంట్లోకి తిరిగివచ్చేడు రాజశేఖరం.

"తోటంతా చూసేరా బాబూ! వెలుగులో చూస్తే ఇంకా బాగుంటుంది" అన్నాడు గోపన్న.

"వెలుగులో అన్న మాటేముంది, వెన్నెట్లో కూడా మీ తోట చాలా అందంగా ఉంది" అన్నాడు రాజశేఖరం.

"మా అమ్మగారికి పువ్వులన్నా మొక్కలన్నా చాలా ఇష్టం. ఎక్కడే కొత్త జాతి మొక్క కన్పించినా ఎలాగోలాగ సంపాదించి తోటలో వేస్తారు" అన్నాడు గోపన్న.

అతడి మాట సత్యం అన్నట్లు గోడ గడియారం అరగంట కొట్టింది.

"మీరు పుస్తకాలు అవీ చూస్తూ ఉండండి బాబూ. నే పోయి వంటపని చూసుకోవాలి. ఇంటికి వచ్చేసరికి భోజనం సిద్ధంగా లేకపోతే అయ్యగారు కేకలేస్తారు" అంటూ గోపన్న వంట ఇంట్లోకి వెళ్లిపోయేడు.

ఎన్నో మేగజైన్లు ఇంగ్లీషువి, తెలుగువి, తేదీలవారీగా దొంతులుపెట్టిఅక్కడ షెల్ఫులో ఉన్నాయి. వాటిని అలా తిరగవేస్తూ అక్కడో ముక్క ఇక్కడో ముక్క చదువుతూ కాలాన్నినెట్టసాగేడు రాజశేఖరం.

ఆ ఇంటిని, పరిసరాల్ని చూస్తుంటే ఆ ఇంటి యజమానిని, యజమానురాల్ని వెంటనే చూడాలన్న కుతూహలం కలిగింది రాజశేఖరానికి. అతడు రాజ్యలక్ష్మిని ఒకసారి ఏదోపెళ్లిలోను, మరోసారి తన అత్తవారింటికి పండక్కి వెళ్లిన సమయంలోను చూట్టం జరిగింది. పెద్ద కళ్ళు, వెడల్పయినముఖం, సూదిగడ్డంతో పెద్ద అందంలేకపోయినా ఆకర్షణీయంగా ఉండేది ఆ పిల్ల. కాని అది ఇటీవలి సంగతికాదు. ఆరేడేళ్లనాటి మాట. ఆ ఒకటి, రెండుసార్లు కూడా 'కులాసాగా



ఇహ లాభం లేదు సార్ నేనున్నంత వరకు ఈరోగి టెంపరేచర్ తగ్గదు

ఉన్నారా' పలకరింపు తప్పిస్తే రాజశేఖరం ఆమెతో పట్టుమని పదినిముషాలైనా మాట్లాడింది లేదు. అప్పటి ఆమె వేషభాషల్లో కాని అలవాట్లలో కాని ఏదీ ప్రత్యేకత ఉన్నట్లు అతడికి కనిపించలేదు. కాని రాజ్యలక్ష్మి చాలా చలాకీగా మాట్లాడుతుందనీ, చురుకైన పిల్ల అని చుట్టు పక్కాలు అంటుండగా విన్నాడు. రాజ్యలక్ష్మి

త్త అయిన ఈ రామచంద్రం ఎటువంటివాడో ఆ పాటి కూడా తెలియదు. కాని ఆ ఇల్లు, తోట, ఇతరమైన వస్తువులు చూస్తుంటే అతడు మంచి కళాభిరుచిగల వ్యక్తిలాగే అన్పించింది రాజశేఖరానికి. బహుశ అతడి సాంగత్యం వల్లనే రాజ్యలక్ష్మి ఈ మొక్కలపట్ల, గృహాలంకరణపట్ల అభిరుచులు పెంచుకుందేమో అనుకొన్నాడు.


# శ్రీ చాముండేశ్వరీ జ్యోతిషాలయం



శ్రీ చాముండేశ్వరీ ఉపాసకులు

ప్రొఫెసర్ :

**సి హెచ్. వి. కృష్ణారావుచౌదరి**

హస్తసాముద్రికము, సంఖ్యాశాస్త్రము, జలర్గళ శాస్త్రము, వాస్తు శాస్త్రము, మంత్ర శాస్త్రము, ప్రశ్న శాస్త్రము, అంటి దోషములు, ఇళ్ళ ప్లానులు, బాలగ్రహ దోషములు, గ్రహబాధలు, పిశాచ దోషములు బాగుచేయబడును.

ఋతుశూల నివారణ చేయబడును.

గ్రహదోష పరిహారమునకు నవగ్రహ శాంతి యంత్రము సర్వజన వశీకర్ణము, సంతాన ప్రాప్తి యంత్రము, మహా శూలిని యంత్రము వివాహ యంత్రము, సరస్వతి యంత్రము, ఉద్యోగ ప్రాప్తి యంత్రము, మహాలక్ష్మి యంత్రము, వ్యాపార అభివృద్ధికి, రోగ నివారణ, భార్యాభర్తలన్యోన్యతకు ఏలినాటి శనికి, అష్టమ శనికి, అర్ధాష్టమ మొదలగు శని దోషములకు యంత్రములు యివ్వబడును.

| | | | |
|---|---|---|---|
| హస్తపరీక్ష | రు. 5-00 | ప్రశ్న | రు. 2-00 |
| చక్రము వేయుటకు | రు. 25-00 | పారిజాతకం | రు. 116-00 |

(పుట్టిన తేదీ సమయము - ం వ్వవలయును.) ఉత్తరముల ద్వారా సంప్రదించవచ్చును.

ఫలితములు వి. పి. పి. ద్వారా పంపబడును.

ప్రతిరోజు ఉ॥ 8-30 నుండి 12 వరకు, సా॥ 4-00 నుండి 5-30 వరకు

ప్రొఫెసర్ **సి హెచ్. వి. కృష్ణారావు చౌదరి,**

కేరళ మంత్రశాస్త్రవేత్త, (నిమ్రుర్ కాలేజ్) మాచవరం, విజయవాడ-4


అలా సోఫాలో కూర్చుని ఆలోచిస్తుండగానే అతడికి మాగన్ను పడింది. గోడ గడియారం టంగ్, టంగ్‌మని గంటలు కొడ్తుంటే తిరిగి తెలివి వచ్చింది.

"బాబుగారూ! చాల వేళయింది. భోజనం చేద్దురుగాని లేవండి" అన్నాడు గోపన్న.

"అయ్యగారు వచ్చేసేరా?" అదరిపడి లేచి సోఫాలో సరిగా సర్దుకొని కూర్చుంటూ ప్రశ్నించేడు రాజశేఖరం; అలా ఎటూ కానివేళ ఆదమరచి నిద్ర పోయినందుకు సిగ్గుపడుతూ.

"లేదుబాబూ... ఇంకా రాలేదు" అన్నాడు గోపన్న.

"ఆయన రానీ... ఇద్దరం కలసే భోజనం చేస్తాం"

"అదికాదుబాబూ. వారు వచ్చేసరికి బాగా రాత్రయేలాగుంది"

"మరేం ఫరవాలేదు. ఇంటియజమాని రాకుండా నాకేంతొందర?" అన్నాడు రాజశేఖరం.

"పదిగంటలయింది బాబూ! ఇంత వరకు అయ్యగారు రాలేదంటే ఆ చౌదరీ గారింటికి వెళ్లుంటారు. అక్కడికి వెళ్తే అంత తొందర్లో రారు."

"మరి భోజనమో ?"

"ఒక్కొక్కసారి వకుళమ్మగారు బలవంతంచేస్తే వారింట్లోనే చేసేస్తారు. లేకపోతే అంతాకలసి బయటికిపోయి తింటారు. వారు ఇక్కడికొచ్చినాసరే, ఆ కబురు, ఈ కబురూ చెప్పుకొంటూ ఒక్కొక్కసారి అర్ధరాత్రి దాటిపోతుంది. వకుళమ్మగారు మాట్లాడుతుంటే ఇంక వినేవారికి ఒంటిమీద తెలివి ఉండదనుకోండి. అంత బాగా మాట్లాడుతారు"

"ఎవరీవకుళమ్మ?"

"చౌదరిగారి భార్యండి. అయ్యగారికి చాలా స్నేహం"

"అది సరేకాని గోపన్నా, నేను ఇలా వచ్చినట్లు అయ్యగారికి ఎలాగైనా తెలియజెయ్యబడుతుందా ?"

"లాభంలేదుబాబూ, శక్రటరీ గారితో కూడా చెప్పలేదుట. ఎప్పుడు వస్తారో, ఎక్కడి కెళ్తారో వారికికూడా తెలియదుట. అందుకే మిమ్మల్ని భోజనం చేసే

మంటున్నాను' అన్నాడు గోపన్న అం ఉ విషయం వివరిస్తూ.

'మరో అరగంట చూద్దాం' అన్నా ఫ రాజశేఖరం.

అరగంట గడచినా అతడు రాలే ు. ఇంక చేసేదిలేక రాజశేఖరం ఆ ఇం భోజనం ముగించేడు.

కడుపునిండా కమ్మని భోజనం ర గించి మెత్తటి ఫోమ్ పరుపుమీద న ం వాల్చేసరికి కళ్లు మూయకుండానే ి ద తరుము కొచ్చింది రాజశేఖరా కి. అర్ధరాత్రి నిద్రలో యేదో అలికిడి, వ ను షుల మాటల సందడితో తిరిగి తె వి వచ్చింది. ముందు హాల్లోను, ప క్క గదుల్లోను లైట్లు వెలుగుతున్నా ు. వల్చని కిటికీ తెరల్లోంచి హాలులో ఉ న్న మనుషులు లీలగా కన్పిస్తున్నారు. గోప న్న చేతులు నలుపుకొంటూ యేదో చె ప్తు న్నాడు. రాజశేఖరం నిద్రని పక కి తొలగించి ఆ మాటల్ని నిదానంగా వి న సాగేడు.

"సాయంకాలం వచ్చేరు బాబు ! మీ కోసం చూసి, చూసి పదకొం డు గంటల ప్రాంతంలో భోజనంచేసి పడు కున్నారు. మీరు వస్తే లేపమని మరీ చెప్పేరు."

"మర్యాదకోసం అతడు అన్నా అర్ధ రాత్రి నిద్రలో ఉన్న మనిషిని ఇప్పుడు లేపడమేమిటి ? నీకేం బుద్ధిలేదా ? తెల్లవారకుండా అమ్మగారు రానే వస్తారు. అన్నీ ఆమె చూసుకొంటారు. రేపు సాయంకాలానికల్లా నేను రానే వస్తాను. ఆయన కాని అడిగితే ఏదో అర్జంటు పనిమీద వెంటనే ఊరుకి వెళ్లవలసి వచ్చిందని చెప్పు" హుందాగా అధికారయుతంగా విన్పించింది ఆ కంఠం.

వెళ్లి ఒకసారి పలకరించివస్తేనో - అనుకొన్నాడు రాజశేఖరం. మరునాడు ఉదయం తన పని తొందరగా పూర్తయి పోతే పన్నెండుగంటల ఎక్స్‌ప్రెస్‌కి వెళ్లి పోవలసి వుంటుంది. ఆ విధాన అతన్ని ఆ సాయంకాలం చూడ్డంపడదు. ఇంతా ఇంటికివచ్చి వారి ఆతిథ్యం అందుకొంటూ ఇంటాయన్ని చూడకుండా వెళ్లిపోతే యేం బాగుంటుంది ? కాని అతడు అంత పని తొందర్లో ఉంటూ చెప్పుల్లో కాళ్ళు పెట్టుకొని ప్రయాణానికి సిద్ధంగా వున్న ప్పుడు ఈ నిద్రముఖంతో వెళ్లి, నేను ఫలానా అంటూ గోత్రనామాలు చెప్పు కొని పరిచయం చేసుకోడం సభ్యతగా ఉంటుందా ?

అతడి ఆలోచన పూర్తయి ఏమైనా ఒకసారి పలకరించిరావడమే మంచిపని అని నిర్ధారించుకొని పక్కమీంచి లేవ బోయేసరికి పోర్టికోలోంచి రయ్‌మని కారు బయటికి దూసుకుపోయింది. ఇంక అప్పుడు ఆ నిద్రకళ్లతో బైటికి వెళ్లి "ఎవరువచ్చేరు ? యేమయింది ?" అంటూ గోపన్నని అడగడంలో అర్థం లేదని ఊరుకొన్నాడు.

అర్ధరాత్రి మెలుకువ రావడంతో తిరిగి చాలాసేపటివరకు రాజశేఖరానికి నిద్రపట్టలేదు. ఉదయం తెలివివచ్చేసరికి బాగా పొద్దెక్కింది. కిటికీతెరలగుండా ఎర్రటి ఎండ గదిలోపడుతున్నాది. తొంద రగాలేచి కాలకృత్యాలు తీర్చుకొని బైటికి వచ్చేడు.

రాజశేఖరం బైటికిరావడం చూసి గోపన్న కాఫీ పట్టుకొచ్చి ముందు పెట్టేడు. రాత్రి అతడు విన్న మాటల్ని బట్టి ఆసరికి రాజ్యలక్ష్మి వచ్చిఉండాలి. అటువంటి సూచనలకోసం అటు ఇటు చూస్తూ "అమ్మగారు వచ్చేసేరా గోపన్నా" అన్నాడు.

"లేదు బాబూ ! ఇంకా రెండు రోజులు పోతేకాని రారుట" అన్నాడు గోపన్న.

రాత్రి హాల్లో మాటలు, అమ్మగారు తెల్లవారకముందే వస్తారని ఎవరో చెప్పడం, ఆ వెనుక కారు బయలుదేరడం ఇదంతా తాను కలగాని కన్నాడా అని ఆలోచనలోపడ్డాడు రాజశేఖరం. "రాత్రి మీ అయ్యగారు రాలేదా" సంశయ నివృత్తికోసం గోపన్నని ప్రశ్నించేడు.

"మీరు నిద్రపోయాక వచ్చేరు బాబూ ! యేదో అర్జంటు పనివడి వెంటనే ఊరికి వెళ్లిపోయేరు. ఈ రోజు తెల్లారే సరికి అమ్మగారు రావలసిందే. మరి యేం కారణమో యేమిటో. రెండు రోజులు పోయేక వస్తాను అని టెలిగ్రాం ఇచ్చేరు" అన్నాడు గోపన్న.









అవిధంగా చుట్టం ఇంట్లో ఉండగా పలకరించనైనా పలకరించకుండా అయ్యగారు ఊరికి వెళ్ళిపోవడం, వస్తారనుకొన్న అమ్మగారు రావడం లేదంటూ టెలిగ్రాం ఇవ్వడం గోపన్నకి బాగా లేదనిపించింది. కాని అతడు చెయ్యగలిగింది ఏముంది? ఇంటికొచ్చిన మనిషిని ఎంత ఆదరంగా చూసినా, ఎంత సదుపాయాలూ చేసినా అతడు ఇంటి నౌకరే అవుతాడు కాని యజమాని కాలేడు కదా? ఇంట్లో ఉన్నవాళ్ళకి ఆ లోటు కన్పిస్తూనే ఉంటుంది.

బ్రేక్‌ఫాస్టు పూర్తిచేసి తనపని చూసుకోడానికి ఊళ్ళోకి బయలుదేరేడు రాజశేఖరం.

"భోజనానికి ఎన్ని గంటలకి వస్తారు బాబూ" అంటూ ప్రశ్నించేడు గోపన్న.

గోపన్న ఎంత మర్యాదగా, సదుపాయంగా చూస్తున్నా ఇంటివాళ్ళు ఎవరూ లేకుండా అట్టేకాలం ఆ ఇంట్లో ఉండడం మర్యాదకాదనుకొన్నాడు రాజశేఖరం. అన్న విధంగా రామచంద్రం సాయంకాలానికి రావచ్చు లేకపని తెముకపోతే మరునాటికి ఉండిపోయినా ఉండిపోవచ్చు. రాజ్యలక్ష్మి ఎలాగా రెండు రోజులు పోతేకాని రాదు. అలాంటప్పుడు వారినికల్సుకోడం కోసం మరోరోజు ఉండిపోడంలో అర్థంలేదు. మొదటు అనుకొన్నట్లు పని అయిపోతే పన్నెండు గంటల బండికి వెళ్ళిపోవడమే మంచిది— అనుకొన్నాడు.

"నా కోసం భోజనం సిద్ధం చెయ్యకు గోపన్నా. పనయిపోతే పన్నెండు గంటల బండికి వెళ్ళిపోతాను. ఉండిపోతే సాయంకాలం వచ్చి మీ అయ్యగార్ని కలుసుకొంటాను. మీ అమ్మగారు వస్తే నేనొచ్చి వెళ్ళినట్లు చెప్పు" అంటూ తన విజిటింగ్‌కార్డు ఒకటి తీసి గోపన్నకి అందించేడు.

"ఏపాటి అవకాశం ఉన్నా ఒక్కసారి వచ్చి వెళ్ళండి బాబూ! అయ్యగారు సాయంకాలానికి తప్పకుండా వచ్చేస్తారు" అన్నాడు గోపన్న గేటు తలుపు తీసి పట్టుకొంటూ.

అనుకొన్నట్లు రాజశేఖరం పని పన్నెండు గంటలకే పూర్తి అయిపోయింది. రామచంద్రాన్ని కల్సుకోడం కోసం సాయంకాలందాకా ఉండబుద్ధి కాలేదు. పన్నెండు గంటల బండిలో బయలుదేరి సాయంకాలానికి ఇల్లు చేరుకొన్నాడు.

"ఏమిటి వాళ్ళింటి సంగతులు? రాజావాళ్ళూ బాగున్నారా? రామచంద్రం గారు ఊర్లో ఉన్నారా? వాళ్ళని మనింటికెప్పుడైనా రమ్మని ఆహ్వానించారా, లేదా" భర్తని చూస్తూనే గుక్కతిప్పుకోకుండా ప్రశ్నలవర్షం కురిపించింది బాలామణి.

"మీ రాజ్యలక్ష్మి లేదు. ఆవిడ ఊరికి వెళ్ళిందట" అన్నాడు రాజశేఖరం.

"పోనీ రామచంద్రంగారైనా ఉన్నారా? లేక ఇద్దరూ కలసే వెళ్ళేరా!"

"ఆయన ఉండడానికి ఊళ్ళోనే ఉన్నాడు. కాని, నేను చూడ్డం మాత్రం అవలేదు. నేను వెళ్ళేసరికి ఆయన ఇంట్లో లేడు. రాత్రి చాలా పొద్దుపోయి ఇంటికి వచ్చేడు. ఏదో అర్జంటుపని ఉందని వెంటనే ఊరికి వెళ్ళిపోయేడు. ఆయన సాయంకాలానికి తిరిగివస్తాడని వాళ్ళ వంటవాడు చెప్పేడు కాని వెళ్ళిన పని కాస్తా వెంటనే పూర్తయింది. ఇంక సాయంకాలందాకా ఆ ఊర్లో ఉండి యేం చేయడం. సరే మరోసారి చూడొచ్చని వచ్చేసేను."

"సరిపోయింది. అయితే మీరు వెళ్ళేసరికి ఇద్దరూ ఇంట్లో లేరన్నమాట. అందుకే ముందుగా ఓ ఉత్తరం ముక్క రాసి పడేయండి స్వామీ అంటే నా మాట వినిపించుకొన్నారు కాదు."

"ఎవరున్నా ఎవరు లేకపోయినా వారింట నా సదుపాయాలకేమీ లోటు రాలేదు. ఎంతో ఆదరంగా అన్నీ అమర్చిపెట్టేడు గోపన్న."

"గోపన్నెవరు?" బాలామణి ఆశ్చర్యంగా ప్రశ్నించింది.

"అదే... వాళ్ళ వంటవాడు"

"రాజయ్య మానేసేడా?"

"అదేమో నాకు తెలియదు. ప్రస్తుతం ఉన్నవాడి పేరు గోపన్న. బాగా వయసు మీరినవాడైనా చాలా ఓపిగ్గా అన్నీ చేసుకుపోతాడు. అయ్యగారన్నా, అమ్మ

గారన్నా చాలా గౌరవం, అభిమానం ఉన్నమనిషిలా కన్పించేడు' అన్నాడు రాజశేఖరం.

రాజశేఖరం, ఆ ఊరు వెళ్లివచ్చిన నాలుగు రోజులనాడు రాజ్యలక్ష్మి దగ్గరనుంచి బాలామణికి ఉత్తరం వచ్చింది. 'మీ శ్రీవారు ఈ నెలాఖరులోగా మా ఊరు వస్తారని అమధ్య ఉత్తరంలో రాసేవు. ఆయన రావడం పడలేదా, లేక మా ఇంటికి రావడానికి మొగమాటపడి రాలేదా' అంటూ.

బాలామణి రాజశేఖరం ప్రయాణ వృత్తాంతం అంతా వివరంగా రాస్తు 'రాజయ్య ఏ పని లోంచి మానిపించేవా? పాపం చాలాకాలంగా చేస్తున్న వాడుకదా ఏదైనా కొంచెం లోటు పాటు వస్తే సర్దుకుపోలేక పోయావా' అంటూ ఒక సలహా కూడా సరఫరా చేసింది.

దానికి జవాబుగా తిరుగు టపాలో బోలెడన్ని ఆశ్చర్యార్థకాలు, ప్రశ్నార్థకాలతో బాలామణికి ఉత్తరం వచ్చింది. ఆమె ఆ ఉత్తరం చదువుతుండగా చాకలివాడు బట్టలకి వచ్చేడు. రాజశేఖరం ప్రయాణంలో వాడిన బట్టలు వేస్తుంటే లాల్చీ జేబులోంచి రెండు వుంజీల ఎండిన గులాబిరేకులు పడ్డాయి.

ఆ సాయంకాలం రాజశేఖరం ఆఫీసునుంచి ఇంటికి వచ్చేసరికి అలవాటు ప్రకారం బాలామణి వీధి గుమ్మంలో ఎదురు రాలేదు. ఇరుగింటికో, పొరుగింటికో వెళ్లి ఉంటుందని కాళ్ళు, చేతులు కడుక్కొని ఫ్లాస్కులో ఉన్న కాఫీ గ్లాసులో పోసుకొని తాగబోతుంటే ఎక్కడనుంచో ఏడుస్తూ ముక్కు ఎగబీరుస్తున్న శబ్దం విన్పించింది. 'ఎవరది? కిష్టిగా ఎందుకురా యేడుస్తున్నావు?' అంటూ రాజశేఖరం అటూ వెళ్లేసరికి అపర సత్యభామ అవతారంలా ప్రత్యక్షమయింది బాలామణి.

'ఏమయింది బాలా? ఎందుకు ఏడుస్తున్నావు? ఎక్కడినుంచీ ఏం చెడు కబురు రాలేదు కదా' అంటూ ఆత్రంగా ప్రశ్నించేడు రాజశేఖరం.

'ఎందుకిలాచేసేరు. చెప్పండి... చెప్పండి' అంటూ అతన్ని పట్టుకొని పిచ్చిపట్టినదానిలా ఊపేసింది బాలామణి.

'ఏమిటిది బాలా? దేనిగురించి ఈ రభస?' అని అతడు ప్రశ్నించేసరికి యేడుపు అడుక్కిపోయి మనసులో ఉన్న కోపం పైకిలేచింది.

'అవును. ఆడది ఏమైనాఅంటే రభస, గొడవ. మగాడు ఏది చేసినా చెల్లుతుంది. ఏం చెప్పినా నమ్మి ఊరుకోడమేకాని ఏమిలా అని అడిగేవారు లేరనేగా ఇలా నాటకాలు ఆడ్డం?' అంటూ రెచ్చిపోయింది.



ద్వివేదుల విశాలాక్షి

'ఇంతకీ ఏం జరిగిందో చెప్పబాలా! ఊరకే ఎందుకలా ఆవేశపడ్తావు?' అమె గడ్డంపట్టుకొని బ్రతిమాలుతున్న ధోరణిలో అన్నాడు రాజశేఖరం.

'రాజ్యలక్ష్మిగారింటికి వెళ్లేనని, వారెవరూ ఇంట్లో లేరని నాతో అబద్ధం చెప్పి ఆరాత్రి మీరు ఎక్కడగడిపేరు? పోనీ మొగమాటంకొద్దీ వారింటికిపోక యే హోటల్లోఅయినా ఉన్నారనుకొంటే... మీజేబులోకిఈగులాబిరేకులు ఎలా వచ్చేయి. చెప్పండి. అసలేం జరిగిందో చెప్పండి. ఎప్పుడూలేంది ఆరోజు నాతో అబద్ధం ఎందుకు చెప్పేరు?' ఈ సారి పూర్తిగా రాగం అందుకుంది బాలామణి.

'నేను రాజ్యలక్ష్మి వారింటికే వెళ్లేను బాలా... నీతోడు. ఏ ఒట్టు వెయ్యమంటే అది వేస్తాను. నామాట నమ్ము.'

బాలామణి తీక్షణంగా భర్తని ఒకసారి చూసింది. ఆమెకి అతడు వెయ్యబోయే ఒట్లు, సత్యాలతో పనిలేదు. ప్రత్యక్ష నిదర్శనంగా రాజ్యలక్ష్మి రాసిన ఉత్తరం ఎదురుగా వుంది. మారు మాటలేకుండా దానిని భర్త చేతిలో పెట్టింది. అతడు దానిని చదువుతుంటే అతడి ముఖకవళికల్ని శ్రద్ధగా పరీక్షించసాగింది.

మతిపోయినవాడిలా ఆ ఉత్తరాన్ని మళ్ళీ మళ్ళీ చదవసాగేడు రాజశేఖరం. అర్థంకాని వాడిలా అటు ఇటుతిప్పి చూసేడు. కవరు మీది ఫ్రమ్ ఎడ్రసు కంటపడేసరికి అతడికి ముచ్చెమటలు పోసేయి.

18 బాబాకాలనీ – అతడికి అంతా అయోమయంగా తోచింది. ఆ రాత్రి తాను గడిపిన 81 బాబాకాలనీలో ఆ సుందర భవనం ఎవరిది? తను వదలి వచ్చిన విజిటింగ్ కార్డుచూసి, ఎవరో తెలియని తన గురించి ఆ దంపతులేమనుకొంటారు. 'ఎవరో మోసగాడు చుట్టం అని పేరు పెట్టుకొచ్చి మస్తుగా తిని పోయేడు. అంతతో సరిపోయిందా? ఇంట్లో వస్తువులు కూడా తస్కరించుకు పోలేదు కదా – అని అనుకోరూ?' పెట్టె పట్టుకొని గుమ్మంలోకి వచ్చిన ప్రతివాణ్ణి ఆదరించి, అతిథి మర్యాద చేసేయడమేనా? ఎవరో,యేమిటో తెలుసుకోవద్దూ' అంటూ పాపం గోపన్నని కేకలేస్తారులా ఉంది. కర్మం చాలక ఆ సమయంలో వారింట యేదైనాపోతే అదొంగతనం తన కంటకడ్తారు. అంతటితో ఊరుకొంటారో లేక ... పోలీసులకి రిపోర్టు ఇచ్చి ... ఇంక ఆలోచించ లేకపోయేడు రాజశేఖరం.


'పెద్ద పొరపాటు జరిగిపోయింది బాలా' అన్నాడు భారంగా నిట్టూరుస్తూ.

'ఏమయిందండీ ఎందుకంతలా కంగారు పడ్తున్నారు?' ఆ స్థితిలో ఉన్న భర్తను చూసి ఆత్రంగా ప్రశ్నించింది బాలామణి.

"ఆ రాత్రి నేను గడిపిన ఇల్లు ఎన ౨ ఒకటి, బాబా కాలనీ"

"అదెలా జరిగింది? ఆ ఇల్లెవరిది"

"నాకేం తెలీయదు. ఆ రోజు రా లక్ష్మి ఇంటి నెంబరు నువ్వ చెప్తే చి కాగితం ముక్క మీద నోటు చే కొన్నాను. దాన్ని తిరగవేసి చు ఎనభై ఒకటి అనుకోడంవల్ల ఈ ప్రమా జరిగిపోయింది. ఇంటి ముందు పే ఆ కనుచీకట్లో అంత బాగా కన్పిం పోయినా బి. రామచంద్రం అని వున్న




అన్పించింది. ఏ మాటి సంకోచం లేకుండా ఆరాత్రి, మరునాటి ఉదయం ఎవరో తెలియని వారింట ఆతిథ్యం అందు కొన్నాను. ఎంత సిగ్గుచేటైనపని? ఎంత అవివేకంగా ప్రవర్తించేను? నన్నుగురించి ఆ దంపతులు ఎంతహీనంగా అనుకొం టారు" మానసిక క్షోభతో, సిగుతో తల పట్టుకొని ఉండిపోయేడు రాజశేఖరం. ఆ సమయంలో అతడి జేబులో కన్పించిన గులాబిరేకులగురించి నిర్భయంగా వాదించలేకపోయింది బాలామణి.

సాధ్యమైనంత తొందరలో ఒకసారి ఆ ఊరు వెళ్ళి ఆ ఇంటివారితో జరిగిపోయిన పొరపాటు తెలియచెసి క్షమాపణ కోరు కోవాలనుకొన్నాడు రాజశేఖరం. మీద పడిన ఆఫీసుపని తొందరల్లతో రెండు మూడు నెలలపాటు ఎటూ కదిలే అవ కాశం లేకపోయింది. అంత కాలం గడిచేక "దొంగ జొచ్చిన అరునెల్లకి కుక్క బౌమంది" అన్నట్లు వారింటికివెళ్ళి ఆ విషయాన్ని తిరుగతోడడంలో అర్థం లేదని ఊరుకొన్నాడు.

రాజశేఖరం మనసులో ఆనాటి సంఘటన బాగా మరుపునపడి పూడుకుపోతున్న సమయంలో తిరిగి అది బయటికి పెగుల్చుకొచ్చే విషయం ఒకటి జరిగింది. అతడు ఆఫీసులో ఉండగా పోస్టుమేన్ టపా ఇచ్చి పోయేడు. అందులో రెండు పెళ్ళి శుభ లేఖలు, ఒక మనియార్డరు రశీదు, తల్లి దగ్గరి నుండి "ఇక్కడ అంతా క్షేమం"తో మొదలై అక్కడి మీ అందరి క్షేమ సమా చారాలు తరుచు రాస్తుండు"తో పూర్తయిన పోస్టుకార్డు ఉన్నాయి. అన్నీ చదివి పక్కన పెట్టగా మిగిలింది ఒక కవరు. అది రాజశేఖరానికి వచ్చిందే. కాని ఆ దస్తూరి మాత్రం అతడికి పూర్తిగా అపరిచిత మయింది. ఎడ్రసు చూస్తూ ఎంత ఆలోచించినా అది ఎవరు రాసి ఉంటారో అతడికి అంతు పట్టలేదు. కవరు మీద ఫ్రమ్ ఎడ్రసులేదు. ఇంత ఆలోచన దేనికి, చించి చూస్తే సరిపోతుంది అను కొన్నాడు.

లేత నీలంరంగు కాగితం మీద ముత్యాలకోవలాంటి అక్షరాలతో ఎంతో నీటుగా రాసిఉంది ఆ ఉత్తరం.

"ఆశలు అందరికీ ఉంటాయి,
కాని కొందరికే అవి ఫలిస్తాయి.
జీవితం అందరికీ ఉంటుంది,
కాని—కొందరే దాన్ని అనుభవిస్తారు."

"ఈ వాక్యాల్ని మీరు అనుభవపూర్వ కంగా రాసుకొన్నారో — లేక అమూల్య సత్యాలుగా దాచుకొన్నారో — నాకు తెలియదు. ఏవిధంగానైనా మీరు నాకు గౌరవనీయులే ... మహనీయులే.

ఈనాడు గెస్టు రూమ్ క్లీన్ చేయి సుంటే, వార్డ్ రోబ్ లోన ఈ కాగితం దొరికింది. ఎందువల్లో ఇది మీదేనని, నా కోసమే వదలిపోయేరనీ అనిపించింది. మీరు ఇచ్చిపోయిన విజిటింగ్ కార్డు మీది ఎడ్రసుకి దీన్ని పంపుతున్నాను.

ఎవరో తెలియని మీకు ఈ ఉత్తరం రాయడంలో వున్న కారణాలు రెండు. మొదటిది అమూల్యమైన మీ వస్తువును మీకు అందజేయడం. రెండోది, మీ పట్ల నాకు ఏర్పడిన ఆదర, గౌరవాల్ని మీకు ఈ ఉత్తరం మూలంగా నివేదించు కోడం.

ఆ పంక్తుల్లో వున్నది ఎదురులేని నిజం; కాదనే బుద్ధిహీను డెవడైనావున్నా ఏదోనాటికి తెలుస్తుంది సత్యం.

ఈనాటి మనబ్రతుకులు సుగర్ కోటెడ్ పిల్సు, పైకెంత తియ్యగా వుంటాయో — లోపలంత చేదువిషం. జీవితం అందరికీ ఉంటుంది. కాని దాన్ని అనుభవించే అదృష్టం కొందరికే ఉంటుంది.

ఉత్తరంకింద సంతకం లేదు. పైన సంబోధనలేదు. లెటర్‌హెడ్ కుడిపక్క ఊరుపేరు ఉంది. ఎడమపక్క "మిసెస్ బి. రఘునాథం—81 బాబా కాలనీ" అని వుంది. ఉత్తరంలో ఆమె ఉదహరించిన కాగితం అట్టితో దానికి గుచ్చబడి ఉంది.

ఉత్తరం చదవడం పూర్తిచేసేసరికి రాజశేఖరం మనసు అదోలా అయిపో యింది. ఎవరో తెలియని ఆమె పట్ల ఎందుకో తెలియని జాలి, సానుభూతి వెల్లువలా పొంగసాగేయి. వెంటనే తను

అక్కడికి వెళ్లి ఏదో చేసెయ్యాలన్నంత ఆవేశం కలిగింది.

ఇంక ఆపైన ఆఫీసులో ఉండి పని చెయ్యలేకపోయేడు. తల నొప్పిగా ఉందని చెప్పి ఇంటికి వెళ్లిపోయేడు.

"యేం అలా ఉన్నారు?" ఇంట్లో కాలు పెడ్తున్న భర్తని చూసి ఆందోళనగా ప్రశ్నించింది బాలామణి.

రాజశేఖరం ఆమెకి యేమీ జవాబు చెప్పలేదు. జేబులోంచి ఉత్తరం తీసి ఆమె చేతిలో పెట్టేడు. బాలామణి దృష్టి లెటర్ హెడ్ పైన ఉన్న ఫ్రమ్ ఎడ్రస్ పైన పడింది. ఒక్క క్షణకాలం ఆమె కళ్ళు కోపంతో జేగురించేయి. అసూయతో, ఈర్ష్యతో ఆమె పెదవులు వణకేయి. అది క్షణంమాత్రమే. మరుక్షణం ఆమె చూపుల్లో ఆవేదన, ఆశ్చర్యం కన్పించేయి. ఒకటికి రెండుసార్లు ఉత్తరం చదివి నెమ్మదిగా అతని చేతిలో పెట్టింది.

"ఒకసారి వెళ్ళిరానా?" అన్నాడు రాజశేఖరం.

"ఎందుకు?"

"ఏమో"

"ఆ కాగితం మీదేనా?" భర్తని ప్రశ్నించింది బాలామణి.

"నాది కాదు" అన్నాడు రాజశేఖరం.

"అయితే వెళ్లకండి. ఆమెకు ఏవిధంగానూ మీరు సహాయ పడలేరు" అంది బాలామణి బాధగా, భారంగా.

అయినా రాజశేఖరం వెళ్లకుండా ఉండలేకపోయాడు. అప్పుడుకాదు. మరో ఆరేళ్ళుపోయేక. 81 బాబా కాలనీ అక్కడే వుంది. ఇంటిలోకూడా పెద్దగా వచ్చిన మార్పేంలేదు. నేమ్ ప్లేటు మాత్రం కొత్తగా వుంది. ఈసారి అక్షరాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఆ పేరు చూసి బి. రామచంద్రం అని పొరబడే అవకాశం ఎంతమాత్రం లేదు,


ఈసారి గేటుముందు ఇంకో బోర్డు కనిపించింది. "కుక్కలున్నాయి! జాగ్రత్త." అన్న అక్షరాలు కొట్టొచ్చినట్లు కనిస్తున్నాయి. ఇప్పుడు రాజశేఖరానికి కుక్కలంటే భయంలేదు. వాళ్ళ ఆఫీసరుగారి ఇంట్లో పులుల్లాంటి రెండు కుక్కలున్నాయి. అవి ఆఫీసరు కాళ్ల ముందు పిల్లుల్లా పడి వుండడం అతడు చాలా సార్లు చూసేడు. అయినా అతనికి లోపలికి వెళ్ళబుద్ధి కాలేదు. గేటుకి ప్రక్కగా నిల్చి ఆ ఇంటిని, ఆ తోటని అలాచూస్తూ వుండిపోయేడు. పొరుగింటిలోంచి ఎవరో ముసలి నౌకరు బయటి కొచ్చేడు. గేటు దగ్గర తచ్చాడుతున్న అతన్ని చూసి, "ఎవరు కావాలి బాబూ" అంటూ ప్రశ్నించేడు.

"ఈ ఇంటి అమ్మగారు..." యేదో అడగబోయేడు రాజశేఖరం.

"ఇక్కడలేరు. వెళ్లిపోయేరు. చాలా కాలం అయింది" అన్నాడు నౌకరు.

"ఎక్కడికి?"

"యేమో ఎవరికీ సరిగా తెలియదు. అంతా తలోక విధంగా అంటారు. యేదో ఆశ్రమంలో ఉన్నారనీ, ఎవడితోనో లేచిపోయిందనీ, సముద్రంలోపడి చచ్చిపోయిందనీ..."




గేటు తలుపు తెరుచుకొంది. రెండు కార్లు జోరుగా వెళ్లి పోర్టికోలో ఆగేయి. ఆడా, మగా చాలమంది బిలబిలమంటూ వాటిల్లోంచి కిందికి దిగేరు. ఆడవాళ్లంతా చిలకల్లా సింగారించుకొన్నారు. మగాళ్లంతా తూగుతూ, నవ్వుతూ ఉత్సాహంగా మాట్లాడుతున్నారు.

"వారిలో వకుళాదేవి, సరళాదేవి, ఇంకా సరోజాదేవి... ఎంతమందైనా దేవులు ఉండవచ్చు. కాని, ఆమె మాత్రం లేదు" అనుకొన్నాడు రాజశేఖరం.

ఆ సాయంకాలం చిరుఎండలో 81 బాబా కాలనీ ఎంతో అందంగా కన్పించింది. అంత అందం వెనుక యేదో వేదన తొంగిచూస్తున్నట్లు అనిపించింది.

"ఈనాటి మన బ్రతుకులు సుగర్ కోటెడ్ పిల్స్. పైకెంత తియ్యగా ఉంటాయో – లోపలంత చేదువిషం"

ఆమె ఉత్తరంలోని వాక్యాలు గుర్తుకొచ్చి రాజశేఖరం కళ్లలో లీలగా నీళ్లు తిరిగేయి.

●●●